సాక్షి సూర్యాపేట
ఆదివారం । 25 । జూన్ । 2023



శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
మట్టపల్లి మహాక్షేత్రంలో శనివారం నిత్య, శాశ్వత కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.
- 10లో



బాలల రక్షణే ప్రభుత్వ ధ్యేయం
బాలబాలికల రక్షణే ధ్యేయమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు అంజన్‌రావు అన్నారు.
- 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32° / 27°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

26 నుంచి రైతు బంధు

• కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు ఈ నెల 26 నుంచి రైతుబంధు సాయం అందించనున్నట్లు కలెక్టర్ యస్. వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రైతుబంధు పథకం ద్వారా 2,89,172 మంది రైతులకు రూ. 317.28 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని వెల్లడించారు. జిల్లాలో 2023 జూన్ 18 వరకు కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు అలాగే ఆన్‌లైన్ ధరణిలో ఈ - పాస్ పుస్తకాలు పొందిన రైతులు, ఒక్కసారి కూడా రైతుబంధుకు దరఖాస్తు చేసుకోని రైతులు ఎవరైనా ఉంటే వెంటనే వానాకాలం రైతుబంధు పథకానికి సంబంధించి వివరాలను ఏఈఓలకు ఇవ్వాలని సూచించారు. రైతుబంధుకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే మండల వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు. ఇప్పటికే రైతుబంధు పొందుతున్న రైతులు మళ్లీ దరఖాస్తు ఇవ్వాల్సిన అవసరం లేదని సూచించారు.

26న కలెక్టరేట్ ఎదుట ధర్నా



హాస్టల్‌లో సమావేశంలో పాల్గొన్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ వసతి గృహాల్లో సమావేశాలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 12 రోజులు అవుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బానోతు వినోద్ నాయక్, శ్రీనివాస్, గోపి, అరుణ్, సుమన్ ,మహేష్, సాయి, వరుణ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని, కేటగిరీల వారీగా జీతాలు ఇవ్వాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కార్మికుల ఇతర సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చామన్నారు. అయినా ముఖ్యమంత్రి పెడచెవిన పెట్టారని, తప్పని పరిస్థితుల్లో వచ్చేనెల 5 నాటికి చర్చలకు పిలిచి పరిష్కారం చూపకపోతే 6వ తేదీ నుంచి జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెకు వెళ్లాల్సివస్తుందని చెప్పారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ధనియాకుల శ్రీనివాస్, మెళ్లచెర్వు సైదులు, నాగరాజు, లింగయ్య, ముత్తయ్య, పద్మ, పవన్ పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీకి పట్టం కట్టాలి

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణలో ఆమ్ ఆద్మీ పార్టీకి పట్టం కట్టాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డిండి సుధాకర్, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ఎం.డీ. అఫ్జల్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని వినాయక నగర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ సూర్యాపేట జిల్లా నూతన కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజలకు ఏవిధంగా అవినీతి లేని పరిపాలన అందిస్తుందో తెలంగాణలో కూడా అలాంటి పరిపాలన అందిస్తుందన్నారు. ప్రజలందరికీ ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా కల్లేపల్లి నరేష్‌ని నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాసిద్, కుత్బుద్దీన్, మహీందర్, చింతమళ్ల కల్యాణి, జనార్దన్, శ్రీలత పాల్గొన్నారు.

చివరి దశకు..
పాలనా భవనాలు


కొనసాగుతున్న సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు

- నెల రోజుల్లో అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక
- కలెక్టరేట్ పనులు పూర్తి చేసేలా కార్యాచరణ
- తుదిమెరుగులు దిద్దుకుంటున్న పోలీస్ కార్యాలయం
- పూర్తికావొచ్చిన సమీకృత మార్కెట్
- ప్రారంభానికి సిద్ధంగా మెడికల్ కళాశాల భవనం

సూర్యాపేట : జిల్లా కేంద్రంలో చేపట్టిన ప్రభుత్వ కార్యాలయ పక్కా భవనాల నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తేచ్చేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే మెడికల్ కళాశాల పూర్తికాగా పోలీస్ కార్యాలయం, సమీకృత మార్కెట్ చివరి దశకు వచ్చాయి. ఇక కలెక్టరేట్ భవన సముదాయాన్ని కూడా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకున్నారు. వచ్చే నెలలో సీఎం పర్యటన ఉంటుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అప్పటిలోగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచేలా కాంట్రాక్టర్‌ను అధికారులు పురమాయిస్తున్నారు.

రూ.76.62కోట్లతో పోలీస్ కార్యాలయం

ముఖ్యమంత్రి తన పర్యటనలో జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణానికి, ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ నిర్మాణానికి కూడా 2017అక్టోబరు 12న శంకుస్థాపన చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయం, ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నిర్మాణాన్ని పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో నల్లచెర్వు వద్ద సర్వే నంబర్ 67లో 27 ఎకరాల ప్రభుత్వ స్థలంలో చేపట్టారు. ఈ రెండు కార్యాలయాల భవన నిర్మాణాలకు గాను రూ 76.62 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు తుదిదశకు చేరుకున్నాయి.


పూర్తికావొచ్చిన జిల్లా పోలీస్ కార్యాలయం

సాగుతున్న కలెక్టరేట్ నిర్మాణం

కుడకుడలో సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు కొన సాగుతున్నాయి. అన్ని జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా 21 ఎకరాల విస్తీర్ణంలో కలెక్టరేట్ భవనంతో పాటు కలెక్టర్, ఇద్దరు అదనపు కలెక్టర్లు, మరో ఇద్దరు జిల్లా అధికారులకు కూడా ఈ ప్రాంగణంలో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. వాస్తవానికి 2017అక్టోబరు 12వ తేదీన సీఎం కలెక్టరేట్ భవనానికి శంకుస్థాపన చేశారు. దీనికిప్రభుత్వం ఇప్పటి వరకు రూ.46కోట్లు మంజూరు చేసింది. దాదాపు రూ.30కోట్ల మేరకు పనులు పూర్తయ్యాయి. మంత్రి జగదీష్‌రెడ్డి, కలెక్టర్ ఎస్. వెంకట్రావులు మే చివరి నాటికి కలెక్టరేట్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ మాసం ముగియవస్తున్నా పనులు పూర్తి కాలేదు. నెల రోజుల్లో పనులు పూర్తి చేసేలా కార్యాచరణతో అధికారులు .. కాంట్రాక్టర్ పై ఒత్తిడి తెస్తున్నారు.

పూర్తికావొచ్చిన సమీకృత మార్కెట్

జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. రూ. 20 కోట్ల వ్యయంతో 2019లో మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

ఆరు నెలల క్రితమే నిర్మాణం పూర్తి


పూర్తయిన ప్రభుత్వ మెడికల్ కళాశాల

జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల వద్ద చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమైంది. మెడికల్ కళాశాలతో పాటు గర్ల్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తి అయి ఆరు నెలల కావొస్తున్నా ప్రారంభం కాలేదు. ముఖ్యమంత్రి పర్యటన జిల్లాలో ఉంటుందని, ఆ సందర్భంగా నూతన భవనాలు ప్రారంభిస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ కార్యాలయాలను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సమీకృత కలెక్టరేట్ పనుల్లో వేగం పెంచాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : నూతన సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను పది రోజుల్లో పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం పట్టణంలోని కుడకుడలో నిర్మిస్తున్న నూతన సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్‌కేశవ్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంపౌండ్ వాల్ , రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని, చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో వర్కర్లను పెంచి అన్ని పనులను పది రోజుల్లో పూర్తి చేసేలా వేగవంతం చేయాలని, అలాగే పనుల్లో జాప్యం లేకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని కోరారు. ఆయన వెంట ఎస్ఈ నర్సింహ నాయక్, ఈఈ యాకుబ్, కాంట్రాక్టర్లు ,సిబ్బంది ఉన్నారు.


సమీకృత కలెక్టరేట్ పనులను పరిశీలిస్తున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్

నేడు సూర్యాపేట జిల్లాలోనే ఉంటా..
ప్రాజెక్టులపై సందేహాలుంటే మాట్లాడొచ్చు


పాదయాత్ర చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, చిత్రంలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, వెంకన్న

- కాంగ్రెస్ హయాంలో తవ్విన ఎస్సారెస్పీ కాల్వలతో ఈ ప్రాంతం సస్యశ్యామలం
- మంత్రి జగదీష్‌రెడ్డి యాదాద్రి థర్మల్ ప్రాజెక్టును పూర్తి చేయించలేకపోయారు
- మూసీ ప్రాజెక్టులో పూడిక తీయించలేదు
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

సూర్యాపేట రూరల్: 'కాంగ్రెస్ హయాంలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్సారెస్పీ కాల్వలు తీయించి గోదావరి జలాలు రప్పించారు.. దీంతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉంది.. నేడు సూర్యాపేట జిల్లాలోనే ఉంటాను.. ఎవరికైనా ప్రాజెక్టులు, నీళ్లపై సందేహాలుంటే నేరుగా మాట్లాడవచ్చు' అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం రాత్రి సూర్యాపేట మండలంలోని వెదిరవారిగూడెం గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా భట్టికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి , టీపీసీసీ కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డిలు వేర్వేరుగా ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. పాదయాత్ర సూర్యాపేట జిల్లాలోకి ప్రవేశించే సమయంలో మూసీనదిపై స్వాగతం పలికిన జనాన్ని చూస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యం అనిపిస్తోందన్నారు. మంత్రి జగదీష్ రెడ్డి.. యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును పూర్తి చేయలేదని, ఎస్సెల్బీసీ టన్నెల్, డిండి ప్రాజెక్టు ద్వారా ఈ జిల్లాకు నీరు కూడా తీసుకురాలేదన్నారు. అప్పట్లో కేసీఆర్ ఇక్కడ కుర్చీ వేసుకుని కూర్చొని మూసీ నదిలో పూడిక తీయిస్తానని చెప్పారని.. ఇంత వరకు పూడిక తీయించలేదన్నారు. సూర్యాపేట జిల్లాకు కొత్తగా ఒక్క ప్రాజెక్టు అయినా కట్టి అదనంగా ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేని దౌర్భాగ్య ప్రభుత్వం ఇదని దుయ్యబట్టారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కట్టిన ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాల్వ ద్వారా, శ్రీపాద ఎల్లంపల్లి నుంచి, మిడ్ మానేరు నుంచి వస్తున్న నీళ్లు అని చెప్పడంలేదన్నారు. అంతేకాక మేము తవ్విన కాకతీయ కాలువ ఫేజ్ 2ను విస్తరించడంతో ఇక్కడికి నీళ్లు వస్తున్నాయని తెలిపారు. ఆ నీళ్ల దగ్గరికెళ్లి పూలు, కుంకుమ జల్లి కేసీఆర్ నీళ్లని చెబుతుంటే నవ్వాలో ఏడ్వాలో అర్థం కావడం లేదన్నారు. నీళ్లు, ప్రాజెక్టుల గురించి తెలియని ప్రజలను పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం తప్పుదోవపట్టిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్డీ ఆర్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్, కొప్పుల వేణారెడ్డి, దండి రమేష్ ఉన్నారు.


భట్టి, ఆర్డీఆర్‌లను గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు


భట్టి విక్రమార్కతో బస్సులో నుంచి కరచాలనం చేస్తున్న ప్రయాణికులు

పోలీస్ పహారాలో గుడిసెల తొలగింపు


నేరేడుచర్లలో ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగిస్తున్న పోలీసులు

- నేరేడుచర్లలో కన్నీటి పర్యంతమైన బాధితులు
- న్యాయం చేయాలని వేడుకోలు

నేరేడుచర్ల : ప్రభుత్వ భూమిలో నిరు పేదలు వేసుకున్న గుడిసెలను పోలీస్‌ల పహారాలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు శనివారం తొలగించారు. తమ గుడిసెలను తొలగించి రోడ్డు పాలు చేశారని కొందరు మహిళలు కన్నీటి పర్యంతంకాగా ఎలా తొలగిస్తారని మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలు ఓ సంఘంగా ఏర్పడి వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో 80 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు కూడా చేపట్టారు. అయినా ఎలాంటి ఫలితం లేకపోడంతో గత నెల 20న జాన్‌పహాడ్ రోడ్డు మిర్యాలగూడ బైపాస్ రోడ్డులోని 243, 244 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలంతా కలిసి మూకుమ్మడిగా రాత్రికిరాత్రే 80కిపైగా గుడిసెలు వేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సరితతో పాటు, నేరేడుచర్ల ఎస్ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పాలకవీడు, గరిడేపల్లి ఎస్ఐలు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది శనివారం తెల్లవారుజాము నుంచే తొలగింపు ప్రక్రియ చేపట్టారు. కొందరు మహిళలు గుడిసెల నుంచి స్వచ్ఛందంగా తమ సామగ్రిని తీసుకెళ్లారు. మరికొందరు కన్నీరుమున్నీరయ్యారు. ఇంకొందరు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ముందస్తుగానే 108 వాహనాన్ని సంఘటన స్థలం వద్దకు రప్పించారు. గుడిసెల తొలగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 2018లో కూడా ఈ నిరుపేదలే ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొగా ఇదే తరహాలో అప్పటి తహసీల్దార్, పోలీస్‌ల సహకారంతో తొలగించారు.


గుడిసెలను తొలగిస్తుండగా పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మహిళ

మమ్ముల్ని రోడ్డు పాలు చేశారు: బాధిత మహిళలు

బాధితులు కోటమ్మ, మౌలాన్‌బీ, సైదాబీ, నర్సమ్మ, వెంకటమ్మ, గోవిందమ్మ మాట్లాడుతూ సారూ తామంతా నిరుపేద కుటుంబాలవారమని తెలిపారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో కూలినాలీ చేసుకొని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. తమ గుడిసెలను తొలగించి రోడ్డుపాలు చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు ఇళ్లు లేవని రోజూ పని చేస్తేనే పూటగడవదని, ఇళ్లకు అద్దెలు కట్టి ఉండలేని పరిస్థితి తమదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కష్టాలను అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించాలని, నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అలాగే గృహలక్ష్మి పథకం కింద ఇళ్ల నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పేదలకు ప్రత్యామ్నాయం చూపాలి

ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించినందున వారికి ప్రత్యామ్నాయం చూపించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయ నాయుడు, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్‌లు కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లనిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. వారి వెంట శ్రీను, హుస్సెన్, సత్తెమ్మ ఉన్నారు.


గుడిసెలను ట్రాక్టర్ ద్వారా తొలగిస్తున్న సిబ్బంది

49 శాతమే వచ్చినయ్!

- 3 లక్షల నోట్ బుక్స్ అవసరముంటే వచ్చింది 1.48 లక్షలే..
- వచ్చిన వాటిని వెంటనే స్కూళ్లకు చేరవేస్తున్న అధికారులు

సూర్యాపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు ఈ ఏడాది నుంచి నోట్ పుస్తకాలను కూడా ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. జూన్ 12 నుంచి పాఠశాలలు తెరుచుకోగా ఇప్పటికే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్నారు. వీటితో పాటు నోట్ పుస్తకాలను కూడా అందజేసేందుకు సిద్ధం చేస్తున్నారు. అయితే నోట్ పుస్తకాలు అవసరమైనన్ని జిల్లాకు రాకపోవడంతో విద్యార్థులందరికీ ఎలా ఇవ్వాలో ప్రధానోపాధ్యాయులకు అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే వచ్చిన నోట్ పుస్తకాలు జిల్లా గోదాం నుంచి మండలాల వారీగా పాఠశాలలకు తరలించారు.


సూర్యాపేటలోని గోదాం నుంచి నోట్ పుస్తకాలను తీసుకెళ్తున్న ఉపాధ్యాయులు

నోట్ పుస్తకాలు పంపిణీ ఇలా..

జిల్లాకు వచ్చిన నోట్ పుస్తకాలను వెంటనే ఆయా మండలాలకు తరలిస్తున్నారు. ఈ నోట్ పుస్తకాలు 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందజేయనున్నారు. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు కూడా అందజేస్తారు. తరగతుల వారీగా నోటు పుస్తకాలు అందించనున్నారు. ఆరు, ఏడు తరగతుల వారికి ఆరు నోటు పుస్తకాల చొప్పున, ఎనిమిదో తరగతికి ఏడు, తొమ్మిది, పది తరగతుల వారికి 14 అందించనున్నారు. వచ్చిన రాత పుస్తకాలు తక్కువగా ఉండటంతో నిర్ణీత సంఖ్య కంటే తక్కువగా ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

వచ్చినవి వెంటనే పంపిణీ చేస్తున్నాం..



జిల్లాకు 3లక్షల నోట్ పుస్తకాలు అవసరముండగా ఇప్పటికే సగం వరకు నోట్ పుస్తకాలు వచ్చాయి. వాటిని వెంటనే ఆయా మండలాలకు సంబంధంచిన పాఠశాలలకు తరలిస్తున్నాం. మిగతావి కూడా త్వరలోనే రానున్నాయి. వచ్చిన పుస్తకాలను వెంటనే విద్యార్థులకు అందజేయాలని హెచ్‌ఎంలకు సూచించాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

వచ్చింది 1.48లక్షల నోట్ పుస్తకాలే..

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 600 ఉన్నాయి. వీటిలో సుమారు 60వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా వాస్తవానికి వీరికి 4లక్షల వరకు నోట్ పుస్తకాలు అవసరమున్నాయి. కానీ ప్రభుత్వం నుంచి 3లక్షల నోట్ పుస్తకాలు మంజూరయ్యాయి. ఇవి కూడా పూర్తి స్థాయిలో రాలేదు. ఇప్పటి వరకు 1.48 లక్షల నోట్ పుస్తకాలు వచ్చాయి. అయితే వీటిని ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని గోదాం నుంచి 23 మండలాలకు సంబంధించి పాఠశాలలకు తరలిస్తున్నారు.

సభను విజయవంతం చేయాలి


తిరుమలగిరిలో సభా స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి): ఈ నెల 27వ తేదీన తిరుమలగిరిలో నిర్వహించే తుంగతుర్తి ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ కోరారు. తిరుమలగిరిలో సభ ఏర్పాటు చేసే స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సభకు మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి హాజరై మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఆయన వెంట సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, తిరుమని యాదగిరి, లక్ష్మయ్య, శోభన్‌బాబు, సందీప్ నేత, బాబు, సీఐ రాజేష్, ఎస్ఐ శివకుమార్ ఉన్నారు.

సమాజ మార్పునకు యువత పోరాడాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): దేశంలో అనేక రుగ్మతలు కొనసాగుతున్నందున యువత సమాజ మార్పు కోసం పోరాడాలని అడ్వకేట్ భద్రయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా 8వ మహాసభలో మాట్లాడారు. యువతరాన్ని నేటి పాలకులు పక్కదారి పట్టిస్తూ వారి మెదళ్లలోకి పాశ్చాత్య సంస్కృతి భావాజాలాన్ని ఎక్కిస్తున్నారని విమర్శించారు. మహాసభలో కునుకుంట్ల సైదులు, నాగయ్య, గంటా నాగయ్య, బొడ్డు శంకర్, ఉదయగిరి, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్

తుంగతుర్తి: రైతులకు మండల సమాఖ్యల ద్వారా సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో మండల సమాఖ్య సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచి సెర్ప్ ద్వారా విక్రయించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం నర్సింహ, సీసీలు, వీబీకేలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కూలీ దుర్మరణం


వేములపల్లి, మాడుగులపల్లి: ట్రాక్టర్ అదుపు తప్పి మహిళా కూలీ మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మాడుగులపల్లి మండలంలోని పాములపాడు గ్రామంలో ఈ ఘటన జరిగింది. పాములపాడు గ్రామానికి చెందిన వేముల జానకిరాములు ఇంటి నిర్మాణానికి రాళ్లు తీసుకువచ్చేందుకు శుక్రవారం అదే గ్రామానికి చెందిన 8 మంది కూలీలను తన ట్రాక్టర్‌లో గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. రాయిని లోడ్ చేసుకొని వస్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ ఓ పక్కకు ఒరగడంతో అందులో కూర్చున్న కూలీల్లో పగిడిమర్రి సైదమ్మ (38) కిందపడగా ఆమెపై రాళ్లుపడి తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం స్థానికులు సూర్యాపేట ఏరియా దవాఖానాకు తరలించారు.అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ప్రమాదంలో పలువురు కూలీలకూ స్వల్పగాయాలైనట్లు తెలిసింది. మృతురాలి భర్త లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనయ్య తెలిపారు.

రేపు ప్రత్యేక సమావేశం

భువనగిరి టౌన్: ఇంటర్నేషనల్ డ్రగ్ ఎబ్యూస్ డే సందర్భంగా కలెక్టర్ అధ్యక్షతన ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు భువనగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమఅధికారి జి.అన్నపూర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అభాగ్యురాలిని ఆదుకోరూ..!

- అనారోగ్యంతో భర్త మృతి
- నిలువ నీడ లేక ఇద్దరు పిల్లలతో మహిళ అష్టకష్టాలు
- సాయమందించాలని వేడుకుంటున్న దివ్యాంగురాలు



కన్నీటి గాథ

కనగల్ : ఉన్నంతలో హాయిగా బతికిన కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చింది. మాయదారి రోగం ఇంటిపెద్దను కబళించగా ఇద్దరు పిల్లలను సాక లేక దివ్యాంగురాలైన ఆ మహిళ అష్టకష్టాలు పడుతోంది. మనసున్న మారాజులు ఆదుకోవాలని అభ్యర్థిస్తోంది. కనగల్ మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన లింగయ్య-మణెమ్మలకు మొదటి కుమారుడు గుండెబోయిన రవీందర్ (36) వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉన్న దాంట్లోనే సర్దుకుని భార్య అనిత, ఇద్దరు కుమార్తెలను సాకుతూ జీవనం సాగిస్తున్నాడు.



భార్య, ఇద్దరు కుమార్తెలతో రవీందర్(ఫైల్)

క్యాన్సర్ బారిన పడి..

రవీందర్ ఏడాది క్రితం అనారోగ్యం బారిన పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. క్రమక్రమేణ రవీందర్ ఆరోగ్యం క్షీణించిపోవడంతో 6నెలలుగా మంచానికే పరిమితం అయ్యాడు. వైద్యం కోసం రవీందర్ భాగానికి వచ్చిన అర ఎకరం భూమి అమ్మడంతో పాటు రూ. లక్షలు అప్పు చేసినా ప్రాణం దక్కలేదని అనిత వాపోతోంది. రవీందర్ మృతితో భార్య అనిత తన ఇద్దరి చిన్న పిల్లలతో రోడ్డున పడింది. ఉండటానికి ఇల్లు, కూడు, గూడు ఎట్లా అని రోదిస్తోంది. కష్టం చేసుకునేందుకు శరీరం సహకరించడం లేదని, ఇద్దరు పిల్లలను సాకేదెట్లా అంటూ కన్నీటి పర్యంతమవుతోంది.

రవీందర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

రవీందర్ మృతితో రోడ్డున పడిన అనిత కుటుంబానికి సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉండటానికి ఇల్లు, పిల్లల చదువుల ఖర్చులు అందించాలని వేడుకుంటున్నారు. సహాయం చేయదలిచిన వారు 9948295832 ఈ నంబర్‌కు ఫోన్‌పే,గూగుల్ పే చేసి నిరుపేద కుటుంబానికి అండగా ఉండాలని అభ్యర్థిస్తున్నారు.

సుపారీ కేసులో మరో ఇద్దరి రిమాండ్

కోదాడ: మూడు రోజుల క్రితం కోదాడకు చెందిన గేట్ కళాశాల కరస్పాండెంట్ బుద్దే కాంతారావును హత్య చేయడానికి కుట్ర పన్ని రు. 50 లక్షలతో సుపారీ గ్యాంగ్‌తో కాంట్రాక్ట్ మాట్లాడుకున్న కేసులో మరో ఇద్దరిని శనివారం కోదాడ పోలీసులు కోర్టుకు రిమాండ్ చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు రిమాండ్ అయిన వారి సంఖ్య 9కి చేరుకుంది. మరో ముగ్గురు పరారీలోనే ఉన్నారు. నిందితులైన బాదే అంజనేయులు, బాదే రాజారావులను అరెస్టు చేసి కోదాడ కోర్టుకు హాజరుపరచడంతో వారికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితులలో ఒకరైన నీలా సత్యనారాయణ మూడు రోజుల క్రితం రిమాండ్ చేసిన సమయంలో గుండెనొప్పి వచ్చిందని చెప్పడంతో ఆయనను హైదరాబాద్‌కు తరలించిన విషయం విదితమే.

మంత్రిని కలిసిన బాధితులు

గేట్ కళాశాల కరస్పాండెంట్ బుద్దే కాంతారావు హత్యకుట్రలో భాగస్వామిగా ఉన్న నీలా సత్యనారాయణ అనేక అక్రమాలకు పాల్పడి పలువురిని మోసం చేశాడని ఆరోపణలు ఉన్నాయి. అతనిపై ఇప్పటివరకు 20కి పైగా కేసులు ఉన్నా చర్యలు తీసుకోవడం లేదని, దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పలువురు నీలా సత్యనారాయణ బాధితులు శుక్రవారం రాత్రి మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. దాదాపు 400 కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని వారు ఆ వినతి పత్రంలో మంత్రికి ఫిర్యాదు చేశారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

వాచ్‌మన్ మృతి

నిడమనూరు: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణా లోపం, ట్రాక్టర్ డ్రైవర్ అధిక వేగం వెరసి నిండు ప్రాణాన్ని బలిగొన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిడమనూరు మండలంలోని తుమ్మడం వద్ద శుక్రవారం తెల్లవారుజామున నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద కాపలాగా పడుకున్న ఆకుల రాములు(66) మీదికి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందిన విషయం తెలిసిందే. తుమ్మడం గ్రామ సమీపంలో వాగుపై పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు. నిర్మాణం వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, నిర్మాణం చుట్టూ జాగ్రత్త చర్యలు తసుకోక పోవడం వల్లనే వాచ్‌మన్‌గా విధుల్లో ఉన్న ఆకుల రాములు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత రక్షణ చర్యలు తీసుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణం వద్ద గుర్తులు, తీసిన గొయ్యిచుట్టూ ఎర్ర రిబ్బన్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత కాంట్రాక్టర్ రక్షణ చర్యలు చేపట్టాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో ఎస్‌ఓటీ పోలీసులు శనివారం రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కేకేతండాకు చెందిన లావుడ్యా సురేష్ చిట్యాల ప్రాంతంలో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశా డు. బియ్యం బస్తాలను ఆటోలో వేసుకొని పటాన్‌చెరువులోని వీరేషం అనే వ్యక్తికి దిగుమతి చేసేందుకు వెళ్తున్నాడు. ఆ క్రమంలో దండుమల్కాపురం గ్రామ శివారులోకి వెళ్లగానే అప్పటికే పక్కా సమాచారం అందుకున్న భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులు జాతీయ రహదారిపై వాహనాన్ని పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వలిగొండ : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని అర్రూర్ గ్రామానికి చెందిన చిలుకమర్రి సత్యం కొంతకాలంగా భూ తగాదాలతో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలోనే మనస్తాపంతో శనివారం వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని భువనగిరి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ఆటో డ్రైవర్ గొంతు కోసింది ఎవరు?

మోతె : గుర్తుతెలియని వ్యక్తులు మోతె మండలానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ గొంతు కోశారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో శనివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోతె మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన పాలకూరి చినరాములు లచ్చమ్మ దంపతుల మూడవ కుమారుడు పాలకూరి మల్లయ్యగౌడ్ 15 సంవత్సరాల కిత్రం బతుకుదెరువు నిమిత్తం హైదరబాద్‌కు వలస వెళ్లాడు. ఎల్‌బీనగర్, చైతన్యపురి ప్రాంతాల్లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది ఆటో యూనియన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు మల్లయ్యగౌడ్ సహచర ఆటో డ్రైవర్లకు ఇటీవల చెప్పాడు. ఈ క్రమంలో మల్లయ్యగౌడ్ ఇంటికి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. శనివారం మల్లయ్యగౌడ్ ఇంటికి వెళ్తున్న క్రమంలో దుండగులు వెంబడించి గొంతు కోసి పరారయ్యారు. ప్రస్తుతం మల్లయ్యగౌడ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆటో యూనియన్ ఎన్నికల్లో పోటీచేస్తున్నందునే ప్రత్యర్థులు దాడికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న బొబ్బ భాగ్యారెడ్డి

కోదాడ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కోదాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలోకి వచ్చిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, దేశంలో సుపరిపాలన అందిస్తున్న మోదీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన యువకులు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి దుగ్గి వెంకటేశ్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన యువ నాయకులు రాచమడుగు నరేష్, కందరబోయిన శ్యామ్‌కుమార్‌లు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో అక్కిరాజు యశ్వంత్, బొలిశెట్టి కృష్ణయ్య, యాదారమేష్, నూకల పద్మారెడ్డి, సాతులూరి హనుమంతరావు, ఓరుగంటి పురుషోత్తం, కొండ్లే రవికుమార్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

- జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్



కోదాడ పట్టణంలో శనివారం జోయాలుక్కాస్ జ్యుయలరీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, చిత్రంలో ఆ సంస్థ రీజినల్ మేనేజర్ రాబిన్ తంబి తదితరులు

యాదాద్రి కలెక్టర్‌కు హైకోర్టు నోటీసు

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి కోర్టు ధిక్కార కేసులో హైకోర్టు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తమ ఆదేశాలు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణ నాటికి కలెక్టర్ నేరుగా గానీ, తన న్యాయవాది ద్వారా గానీ వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జూలై 14కు వాయిదా వేసింది. సికింద్రాబాద్‌కు చెందిన నర్సింగ్‌రావుకు యాదగిరిగుట్ట మండలం సైదాపూర్‌లో సర్వే నంబర్ 119/ఏఏ/1లో ఐదు ఎకరాల భూమి ఉంది. దీనికి సేల్‌డీడ్ డాక్యుమెంట్ కూడా ఉంది. అయితే, కొత్త పాస్‌పుస్తకాలు ఇచ్చే సమయంలో ఇది 'నిషేధిత' జాబితాలోకి వెళ్లింది. దీనిపై కలెక్టర్‌కు దరఖాస్తు చేయగా కలెక్టర్ ఆ దరఖాస్తును తిరస్కరించారు. దీంతో నర్సింగ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. దరఖాస్తును ఎందుకు తిరస్కరించారో తెలియజేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. 8 వారాలు గడువు ఇచ్చింది. కోర్టు ఇచ్చిన గడువు ముగిసినా ఎలాంటి కారణం తెలియజేయకపోవడంతో నర్సింగ్‌రావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. అధికారులు కావాలనే కోర్టు ఆదేశాలు పాటించడం లేదని పేర్కొన్నారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీచేసింది.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- రూ. 60.50 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకట్‌రెడ్డి

భువనగిరి : చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.60.50లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ వెంకట్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బొమ్మలరామారం మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన ధరావత్ బిచ్చాలు ఇటీవల తన కుటుంబ అవసరాల కోసం భూమిని విక్రయించగా వచ్చిన రూ. 60.50 లక్షలను గోనె సంచిలో పెట్టి ఇంట్లోని బాత్‌రూమ్‌లోని సజ్జపైన దాచిపెట్టాడు. విషయం తెలిసిన బిచ్చాలు తమ్ముని కొడుకు ధరావత్ వినోద్ ఎలాగైన ఆ డబ్బులు దొంగిలించాలని అవకాశం కోసం ఎదురు చూశాడు. ఈ నెల 22న బిచ్చాలు నాయక్ ఇంటిలోని బాత్ రూమ్‌ను మరమ్మతులు చేసేందుకు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు పనులను అప్పగించాడు. ఈ క్రమంలో బిచ్చాలు భార్య అండాలు పనివారితో పనులు చేయిస్తుండగా ఇంటి యాజమాని తన కూతురు, అల్లుడుతో కలిసి తమ పనుల కోసం బయటకు వెళ్లారు. గమనించిన వినోద్ ఇంట్లోకి వెళ్లాడు. ఇంట్లో పనిచేస్తున్న పనివాళ్లతో పాటు పెద్దమ్మతో మాట్లాడుతూ డబ్బులు దాచిన విషయాన్ని తెలుసుకున్నాడు. ఈ సమయంలో పనుల్లో మునిగిపోయిన వారిని గమనించి బాతు రూమ్‌లోకి వెళ్లి దాచిపెట్టిన డబ్బుల సంచిని తీసుకొని వెళ్లాడు. అదే రాత్రి డబ్బులు పోయినట్లు గమనించిన బిచ్చాలు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 23న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా ఫిర్యాదుదారులు అనుమానం వ్యక్తం చేసిన తమ్ముని కొడుకు వినోద్‌ను పట్టుకుని విచారించగా నేరం అంగీకరించాడు. డబ్బులను అదే రోజు భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో ఉన్న అత్తగారింటికి వెళ్లి అక్కడ అత్త, బావమరిది సహాయంతో ఇంట్లో డబ్బుల మూటను గుంత తీసి పాతి పెట్టిన్నట్లు ఒప్పుకోవడంతో వెంటనే అక్కడికి పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దొంగతానికి పాల్పడిని వ్యక్తిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ముగ్గురికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి : ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఓయువకుడు మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం సాయంత్రం మండల శివారులోని శ్రీమిత్ర టౌన్‌షిప్ సమీపంలో జరిగింది. పోచంపల్లికి చెందిన సెంట్రింగ్ మేస్త్రీ పబ్బాల యాదయ్య వద్ద సీతవానిగూడేనికి చెందిన కడెం అజయ్‌కుమార్(18), బండారి కార్తీక్, శేషరాజ్ పాండు, బండారి అభిలాష్, విజయ్ కూలీగా పనిచేస్తున్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్‌లో సెంట్రింగ్ పనులు ముగించుకొని ట్రాలీ ఆటోలో సాయంత్రం ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో మండల శివారులో శ్రీమిత్ర టౌన్‌షిప్ సమీపంలో కల్వర్టు వద్దకు రాగానే ఆటో డ్రైవర్ బండారి అభిలాష్ సడన్‌బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో ప్రయాణిస్తున్న కడెం అజయ్‌కుమార్, బండారు కార్తీక్, విజయ్‌లకు గాయాలయ్యాయి. కడెం అజయ్‌కుమార్‌కు ట్రాలీలో ఉన్న రాడ్‌లు తలకు బలంగా తాకడంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రులందరినీ చికిత్స నిమిత్తం హయాత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా అజయ్‌కుమార్ మార్గమధ్యలో మృతిచెందాడు. ఆటోలో ముందు కూర్చున్న పాండుతో పాటు డ్రైవర్ అభిలాష మాత్రం స్వలగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

ఉపాధి కోసం వస్తే ..

కడెం అజయ్‌కుమార్‌ది స్వస్థలం మహారాష్ట్రంలోని నాందేడ్. ఇతడి తండ్రి కడెం కేశవ్ ఉపాధి కోసం కుటుంబ సభ్యులతో కలిసి 12 ఏళ్ల క్రితం పోచంపల్లికి వలస వచ్చి సీతావానిగూడెంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కేశవ్ కూలీనాలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకొనేది. కుటుంబ కలహాలతో అజయ్‌కుమార్ తల్లి పదేళ్ల క్రితం ఇంట్లో కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకొంది. అదేవిధంగా రెండేళ్ల క్రితం కడుపునొప్పి భరించలేక అజయ్‌కుమార్ అన్న కూడా ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిగిలిన ఒక్క కొడుకు కూడా మృతి చెందడంతో తండ్రీ రోదన వర్ణనాతీతంగా మారింది.

చిరు ధాన్యాల సాగుతో అధిక లాభాలు

- పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్ సూచనలు



పాడి పంట

పెద్దవూర: వరి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు చిరు ధాన్యాల పంటలైన జొన్న, సజ్జ, రాగి, కొర్ర పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, అధిక లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ తెలుపుతున్నారు. చిరుధాన్యాలు రక్తపోటు, మధుమేహం, ఎముకల పటుత్వ లేమి, ఊబకాయం సమస్యలతో బాధపడే వారికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

సజ్జ

ఖరీఫ్‌లో సజ్జ పంటను జూన్ రెండో వారం నుంచి జూలై మూడో వారం వరకు విత్తుకోవచ్చు. రాష్ట్రంలోని అన్ని సజ్జను ఖరీఫ్‌లో సాగు చేస్తారు.

రకాలు: ఐసీఎంహెచ్ 356(హైబ్రీడ్), పీహెచ్‌బీ3, ఏహెచ్‌బీ 1 పేరున్న హైబ్రీడ్ రకాలను సాగుకు ఎంచుకోవాలి. ఎకరాకు 1.6 కిలోల విత్తనం వాడుకోవాలి. వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 45 సెంటీమీటర్లు దూరంలో విత్తుకోవాలి.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి కాప్టాన్ లేదా 3 గ్రాముల థైరామ్ కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: ఒక టన్ను పశువుల ఎరువుతో పాటు ఎకరాకు వర్షాధార పంటకు 24-12-8 చొప్పున, నీటి వసతి కింద 32-16-12 కిలోల చొప్పున నత్రజని-భాస్వరం-పొటాష్ ఎరువులను వేసుకోవాలి. నత్రజని ఎరువును రెండు దఫాలుగా పంట విత్తేటప్పుడు, విత్తిన 30 నుంచి 35 రోజులకు వేయాలి. రెండు సాళ్ల సజ్జ పంటకు ఒక సాలు కంది పంటను అంతర పంటగా వేసుకోవచ్చు. జొన్న పంటలో సూచించిన మాదిరి అట్రజిన్ కలుపు మందుతో కలుపును నివారించాలి. పంట కీలక దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. సజ్జ పంట 70 నుంచి 80 రోజులలో కోతకు వచ్చి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

రాగి : వానా కాలంలో రాగి పంటను జూలై నుంచి ఆగస్టు వరకు విత్తుకోవచ్చు. రాగి పంట 80 నుంచి 115 రోజులలో చేతికి వస్తుంది. స్వల్పకాలిక రకాలైన మారుతి, చంపావతి, 80 నుంచి 90 రోజుల్లో.., మధ్యకాల రకాలైన సప్తగిరి, భారతి, గోదావరి, 100 నుంచి 115 రోజుల్లో, పీపీఆర్ 1012 రకం 115 నుంచి 120 రోజులలో పంట కోతకు వచ్చి ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి ఇస్తాయి. రాగిని నేరుగా విత్తనాన్ని వెదజల్లి నారు పెంచి నాటే విధానంలో సాగు చేయవచ్చు. ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తనాన్ని వరుసల మధ్య 15 నుంచి 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15 సెంటీమీటర్లు దూరంలో విత్తుకోవాలి. నారుమడికి 640 గ్రాముల లెక్కన నత్రజని, భాస్వరం, 480 గ్రాముల పొటాష్ ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. ప్రధాన పొలంలో నాలుగు టన్నుల పశువుల ఎరువులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోలు నత్రజని, 8 కిలోల పొటాష్, 12 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువులు విత్తేటప్పుడు లేదా నాటేటప్పుడు వేసుకోవాలి. విత్తనాన్ని వెదజల్లేటప్పుడు భూమిని మెత్తగా తయారు చేసి విత్తనాన్ని సమానంగా చల్లుకోవాలి. విత్తనం చల్లిన తరువాత బల్లతో గాని, చెట్టు కొమ్మతో గాని చదును చేసుకోవాలి. విత్తిన వెంటనే మొలకలు రాక ముందు లీటర్ నీటిలో 3 మిల్లీ లీటర్లు పెండి మిథాలిన్‌ను కలిపి పిచికారీ చేయాలి. నాటిన 15 నుంచి 18 రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు ఉంటే 2,4-డీ సోడియం సాల్టును రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుని కలుపు నివారించుకోవాలి.

జొన్న

వానాకాలంలో రాష్ట్రంలో జొన్న పంటను అన్ని జిల్లాలలో సాగు చేయవచ్చు. నల్లరేగడి, తేలికపాటి నేలలు జొన్న పంటకు అనుకూలం. ఖరీఫ్‌లో తొలకరి వర్షాలు కురవగానే వర్షపాతం ఆధారంగా జూన్ మొదటి వారం నుంచి జూలై చివరి వారం వరకు విత్తుకోవాలి. విత్తడం ఆలస్యమైతే కాండం తొలుచే పురుగు ఉధృతి పెరుగుతుంది.

రకాలు: హైబ్రీడ్ రకాలైన సీఎస్‌హెచ్ 14, 16, 18, 21 రకాలతో పాటు ప్రాచుర్యం పొందిన ప్రైవేటు కంపెనీల హైబ్రీడ్ రకాలను సాగు చేయవచ్చు. హైబ్రీడ్ రకాలలో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చు. సాధారణ రకాలైన సీఎస్‌వీ 15, శ్రీశైల(పీఎస్‌వీ-56) రకాలు సాగు చేయవచ్చు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

విత్తే విధానం: జొన్న సాగుకు ఎకరాకు 3 నుంచి 4 కిలోల విత్తనం వాడుకోవాలి. వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 12 నుంచి 15 సెంటీమీటర్ల దూరం ఉండేలా విత్తకోవాలి.

విత్తనశుద్ధి: విత్తే ముందు కిలో విత్తనానికి మూడు గ్రాములు థయోమీ థక్సం, మూడు గ్రాములు కాప్టాన్ లేదా థైరామ్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువుతో పాటు 32-24-18 కిలోలు చొప్పున నత్రజని-భాస్వరం-పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

అంతర పంట: జొన్నలో కందిని అంతర పంటగా 2:1 నిష్పత్తిలో సాగు చేసుకోవచ్చు. విత్తిన 42 గంటల్లోపు లీటరు నీటికి 4 గ్రాములు అట్రజిన్ కలుపు మందును కలిపి పిచికారీ చేస్తే మొదటి దశలో వచ్చే కలుపును నివారించవచ్చు. జొన్నలో ఎక్కువ కష్టం కలిగించే మల్లె(కలుపు) నివారణకు లీటర్ నీటికి 50 గ్రాముల అమ్మోనియం సల్ఫేట్ లేదా 2.4-డి సోడియం సాల్ట్ 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

కొర్ర : ఖరీఫ్ పంటగా కొర్రను జూలై, ఆగష్టు మాసాలలో విత్తుకోవాలి. కొర్ర పంట 70 నుంచి 85 రోజులలో కోతకు వస్తుంది. కొర్రలో ప్రసాద్, కృష్ణదేవరాయ, శ్రీలక్ష్మీ, సూర్యనంది, ఎస్ఐఏ 3085, ఎస్ఐఏ 3156 రకాలు అనుకూలం. పప్పు శనగకు ముందు 70-75 రోజులలో సూర్యనంది కొర్రలు సాగు చేసి శనగ వేసుకుంటే నికర ఆదాయం పెరుగుతుంది.

విత్తనశుద్ధి : ఎకరాకు సాళ్లలో విత్తేతే 9 కిలోలు, వెదజల్లే పద్ధతిలో 4 కిలోల విత్తనం వాడాలి. కిలో విత్తనానికి కార్బండిజం 2 గ్రాములు కలిపి విత్తన శుద్ధి చేసి సాళ్ల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఎడం ఉండేలా విత్తుకోవాలి. విత్తిన 20 నుంచి 25 రోజులకు సాళ్లలో అంతర కృషి చేసి కలుపు నివారించాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరాకు రెండు టన్నుల పశువుల ఎరువు, 8 కిలోల నత్రజని, 17 కిలోల భాస్వరం వేసుకోవాలి. వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా తక్కువ నీటి వినియోగంలో ఉన్న చిరుధాన్యాల పంటలు ఎంచుకుంటే తక్కువ పెట్టుబడులతో అదాయాలు పొందవచ్చు.